# తాకని కిరణాలు

చనర:
రచయిత్రి మనుకొండ సత్యవతి.

[ఈ కథ నా స్వహస్త లిఖితము. దేనికీ అనువాదముకాని, అనుసరణకాని కాదు. ఇది ప్రచురించడములో ఎటువంటి ఆక్షేపనలు ఉండవు.

ఇది ఎవరినీ దృష్టిలో పెట్టుకొని వ్రాసినదికాదు. కేవలము కల్పితము.

రచయిత్రి
కుమారి మనుకొండ సత్యవతి.]

ప్రొద్దుపోయే సమయము, పశ్చిమ దిక్కుగా అరుణ కాంతులు మెల్లగా సన్నగిల్లుతున్న సమయము, తిరిగి తిరిగి అలసిపోయిన రెక్కలతో, గూడుకి చేరుకుంటున్న పక్షుల కిలకిల సవ్వడులు, సన్నని పిల్లగాలుల తాకిడికి పులకించినట్లయే చెట్ల ఆకుల కదలికలు, ఆటలలో పిల్లల కేరింతలు, వింత అనుభూతులతో, సృష్టించిన చిత్రమైన భగవానునికి మనస్సులోనే స్మరిస్తూ, ప్రకృతి శోభనంతను కనులలో నింపుకొని చూస్తున్న రమాదేవికి తానని తనే మరచిపోయేలా పులకిస్తూంది.

'రమా! కాఫీ' అంటూ, గుమ్మం దగ్గరే నిల్చుని చూస్తున్న రమాదేవి వైపు దృష్టి సారిస్తూ, చూస్తుండిపోయారు రాజశేఖం (ఏమి ఈ మూగ చూపు అని మనసులో అనుకుంటూ).

'ఇదిగో దేవిగారు! అంతా మీరే అనుభవించి సంతోషిస్తే మాకుగూడ చెప్పి సంతోషింపజేయగూడదా' వ్యంగంగా అంటూ మాటలతో కదిలింపజూసారు ఆమె భర్త గదిలోకి అడుగు పెడుతు.

మాటలకు ఉలిక్కిపడి తన మనస్సుని ఆధీనములోనికి తెచ్చుకుంటూ 'అయ్యో, భలేవారె! మీరెంత సేపయిందండి వచ్చి? చూడనేలేదు. పిల్లలు ఇపుడే ఆటకి వెళ్తేను చూస్తూ నిల్చుండిపోయానండి.' 'ఆమాత్రానికే కస్సుమనాలుటండి. ఉండండి కాఫీ కలిపి తెస్తాను' అంటూ గబగబా వంట గదిలోకి జారుకుంది.

'అమ్మా చూడవే! సీత నన్నెలా కొట్టిందో' అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న కృష్ణని గదిలోకి వస్తుంటే చూసి 'అరెరె! ఎవరు కొట్టారురా' కన్నీళ్ళను పమిటి చెంగుతో తుడుస్తూ అడిగింది.' ఊ. ఊ...మరే .. మరే...'ఏవిటిరా! ఏడవటమేగాని ఎవరు కొట్టారో చెప్పవేం'? మరే ..సీత నేనొక్కడ్నే ఆడుకుంటూంటే, నే నాడతానంటూ వచ్చిందమ్మా, పో!...నీవేం ఆడక్కర్లా అన్నా, ఊ...ఊ...టక్కున నా తలకాయపై ఒక మొట్టికాయపెట్టి పారిపోయిందమ్మా' ఊ...ఊ...

'లేదులే నాయనా, ఇంక నిన్నెవరూ కొట్టరులే, ఆ పిలతోనె చెప్తాలే, వెళ్ళి ఆడుకో, చ! ఆడపిల్ల కొడితే ఏడుస్తావేమిటి, ఆ పిల్ల వట్టి అల్లరి పిల్ల. నీవెళ్ళి రమణితో ఆడుకో వెళ్ళు, ఏడవకు' కొడుకుని తిరిగి ఆటకి పంపించేసరికి రమాదేవికి తలప్రాణం తోకకొచ్చింది.

ఆవూరు డాక్టరుగా చలామణీ అవుతున్న రాజశేఖరంగారు భార్యామణి రమాదేవి ఒకానొక తల్లిదండ్రుల గారాబాల కూతురు. వెనుక ఎవరూ లేకపోవుటచే అల్లుడినే కొడుకుగా భావించి ఆస్తినంతా ఆయనపేర రాసేస్తూ కన్ను మూసారు ఆ ముసలి దంపతులు.

◆ ◆ ◆

చీకటి బాగా రాజ్యం చేస్తుంది. భోజనాలయిన తరువాత బామ్మదగ్గరకొచ్చి 'కథ చెప్పు బామ్మా' అంటూ పోరుతున్నారు అన్నా, చెల్లెలిద్దరూ.

'చెప్తాగాని మీరు చగివేసుకున్నారా' చక్కటి మందలింపుతో ప్రశ్నించింది బామ్మ.

'ఓ! ఎప్పుడో చదివేశాము' చప్పున మెదడులోకి వచ్చిన అబద్దాన్ని చక్కగా చెప్పేసింది రమణి.

'ఛ! వట్టిదే! నేను ఒక్కడినే చదువుకున్నాను' కోపంతో చెల్లెలు వంక చూస్తూ అన్నాడు.

'పోనీలే చెల్లెలు చిన్నదికదూ' రేపు చదువుకుంటుందిలే' రమణిని గెలిపించే దోరణిలో నస్యం పీలుస్తూ అంది.

'మరి కథ చెప్పుబామ్మ ఏక కంఠంతో ఒకేమారు ఆ రెండు పెదవులు పలికినయి.

'మరైతే వినండి. అనగా, అనగా ఒక రాజు. రాజుగారుకు నల్గురు కొడుకులు. ఒక రోజున రాజుగారు పుత్రులు వేటకు బయలుదేరారు. నాల్గుచేపలు వేటాడి తెచ్చారు. ఎండలోవేస్తే అందులో ఒక చేప ఎండలేదు.'

'ఆహా! ఎందుకు ఎండలేదేమిటి' బుంగమూతి పెట్టుకుంటూ అడిగాడు కృష్ణ.

'నువ్వూరుకో అన్నయ్యా దామ్మని కథ చెప్పనియ్యి'

'అలాకాదు ఎందుకు ఎండలేదో బామ్మ చెప్పాలి' మరలా ఎదురు ప్రశ్న వేస్తూ 'అన్నీ ఒకేసారి ఎండలో వేసారా బామ్మా' అడిగాడు కృష్ణ.

'ఆ... వేసారు నాయనా'

'మరింకేం అన్నీ ఒకేసారి ఎండలో వేస్తే ఆ ఒక్కటీ తప్పకుండా ఎండి తీరాలే. అన్నీ ఎండి కూడా ఒక్కటీ

ఎండకపోతే ఏం బావుంటుంది బామ్మా'—అయినా ఆ చేపే ఎండక పోవటానికి కారణం మేమిటి? చెప్పు బామ్మ' మనసులోని ఆదుర్దాతో ఎటువంటి జవాబు బామ్మ నోటి నుండి వస్తుందోనని ఎదురు చూస్తూ అడిగాడు కృష్ణ.

'ఓరి' వెర్రివాయనా! అన్ని చేపలు ఒకేసారి ఎండలో వేసినా ఆ ఒక్క చేపకు తప్ప సూర్యకిరణాలు తక్కిన వాటిపై ప్రసారించేయి.'

అని సమాధానం చెపుతూ ఇటువంటి ప్రశ్నలు రానీకు' అంటూ తన వైపే చూస్తున్న మనుమడిని ముద్దులాడింది.

'మరి నన్నే ముద్దాడలేదేం' కోపాన్ని నుదుటిపై ఇమిడిస్తున్న రమణిని దగ్గరకు తీసుకొని 'నువ్వు కూడా ముద్దొస్తున్నావే' అని నుదుటిపై చిన్న ముద్దుపెట్టింది. తన మనస్సుకు బామ్మ ఇచ్చిన సమాధానము సరిపడక పోగా 'నాకీ కథ ఏం బాగా లేదు. ప్రపంచాన్నంతా వెలుగుతో నింపి ఏలుతున్నవాడు, ఒక్క భగవానుడని చెప్పావే మరి ఆ చేపపై తన కిరణాలును ఎందుకు పడనివ్వలేదు. పాపం ఆ ఒక్క చేప ఎండకపోతే రాజుగారబ్బాయి ఎంత ఓడిపోయాడో, పాపం వాళ్ళన్నయ్యలు ఏం ఉడికించారో, నాకిలాంటి కథ అక్కరలేదు. ఆ చేప కూడా ఎండిందని చెప్తె నీ సొమ్మేం పోయింది.—ఎండిందని చెప్తేనే వింటాం లేకపోతే వెళ్ళిపోతాం, మే మిద్దరం ఒక్కటే అన్నట్టు చెల్లెలి వంక చూస్తూ' తన మనసులోని వాటిని బయట పెట్టాడు.

'నేనేం చేసేది నాయనా! కథలో అలా చెప్పివుంటే మనం మార్చి చెప్పగలమా, మరీ అంతమారాం జేస్తే నే నసలు కథే చెప్పను.' అంటూ ముసిముసిగా బోసి నవ్వు నవ్వుతుంది.

అయితే నీకథ మాకేం అఖ్ఖర్లేదు. పదవే చెల్లి హాయిగా మంచంమీద పడుకుంటూ చుక్కలన్నీ లెక్కపెట్టెద్దాం.'

తను ఆశించని జవాబు వచ్చినందుకు చిరుకోపాన్ని ముఖంపై వెలగజేస్తూ అన్న-అన్నమాటలకు—

'పో! నేనేం రాను. నాకు బామ్మ చెప్పిన కథే బాగుంది.' బుంగమూతి పెట్టుకుంటూ చెప్పింది.

'ఆహా! అయితె కథ నీ వక్కదానివే విను. నే వెళ్ళిపోతా! నంటూ తుర్రుమన్నాడు.

'హుం! అన్నయ్యకి అన్నీ అడ్డు ప్రశ్నలే, ఏమీ తెలీదు. కథ చెప్పితే సరిగ్గా వినడు, ఊ, కథ చెప్పు బామ్మా' అంటూ అన్నయ్య వెళ్ళిన వైపే చూస్తూ బామ్మదగ్గరకు జరిగి కూర్చుంది.

'విను, దిగులుతో రాజకుమారుడు తండ్రివద్దకు వెళ్ళి బిక్క మొహంతో నిల్చున్నాడు. ఇంతలో అన్నలు తమ ప్రతాపాలు తండ్రికి చూపించి బహుమతులు పొంది తమ్ముడిని చూచి నవ్వుతూ గేలిచేసారు. రాజకుమారుడుకి ఏం తోచక సిగ్గుతో ఊరు విడచి పారిపోయాడు అక్కడ ఆకు అలము తింటూ భగవంతునిపై మనస్సు లగ్నంచేసి పెద్ద తప స్వరూపుడై భగవంతునిలో లీనమై పోయాడు.' అంటూ తన కథ ముగించి కథ వింటున్నట్టే నటించి గాఢ నిద్రలో మునిగివున్న రమణిని చూసి 'ఓసి పిచ్చి పిల్లా! విన్నట్టే విని నిద్రపోయావంటూ తోసి మంచంపై పరుండబెట్టింది.

నిద్రరాక అటూ ఇటూ దొర్లుతూ ఆకాశంవైపు చూస్తు ఈ చీకటి ఎందుకొస్తుందబ్బా. చీకటైతే ఏం బావుండదు. పాపం రాజకుమారుడు చేప ఎండలేదు. ఓడిపోయాడు. ఛీ! బామ్మ అన్నీ ఇటువంటీ కథలె చెప్పుతుంది. మొన్నను ఒకసారి ఇటువంటి కదే చెప్పింది. రాజుగారికి. ఒక కూతురున్నాదట. ఆ అమ్మాయి పెద్దదైన తరువాత ఒక రాజకుమారుడు ఆ అమ్మాయిని చూసి ప్రేమించి పెళ్ళాడతా నన్నాట్ట. ఇలా ఉండగా మంత్రిగాడు రాజకుమారుని ఎత్తుకుపోతే నా కుమార్తెను ఈ యువరాజే ఎత్తుకు పోయాడని, యువరాణి తండ్రి ఆ అబ్బాయికి ఉరిశిక్ష వేశాడట, అన్నీ ఏడుపు కథలే చెప్పుతుంది. ఇకనుండి నేనసలు కథలే చెప్పించుకోను. నిజం చందమామ నీపై ఒట్టు నామాట నమ్ము. ఇంకెప్పుడు అలాటు కథలే చెప్పించుకోను.'

అంటూ చందమామతో తనలో దాగివున్న ఆవేశాన్ని పైకి అనేస్తూ అటు ఇటూ దొర్లుతున్నాడు.

(సశేషం)


కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

[స్థాపితము 1938]

విడి ప్రతి ... 25 పై.

సంవత్సర చందా ... రూ 5-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్‌లోనూ దొరకును.